కథ

# రహస్యం

—అయ్యేన్నెస్

"సార్ రాత్రికి ఇక్కడే వుంటారు. ఏం కావాలన్నా చూసుకో..." అన్నాడు గెస్ట్‌హౌస్ మేనేజర్.

"సరే సార్" అంటూ వెళ్ళబోతున్న ఆ కుర్రాడిని ఆపి తన కారు తాళం చెవులు ఇస్తూ—

"డిక్కీలో వున్న సామాను తీసుకొచ్చి లోపల పెట్టు" అన్నాడు రాజారావు.

ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు రాజారావు. అనంతపురంలో తన ఆఫీసుకి విజిట్‌కు వెడుతూ చీకటి పడుతూండటంతో ఆ రాత్రి ఆ గెస్ట్‌హౌస్‌లో మకాం చేయడానికి నిశ్చయించుకున్నాడు.

మరో పావు గంటకి మేనేజర్ రూమ్ లోంచి బయటకు వచ్చి, గెస్ట్‌హౌస్ లోపలికి అడుగు పెడుతూ అంతా నీట్‌గా వుండటంతో "గుడ్" అంటూ సంతృప్తిగా తలూపాడు రాజారావు.

చిన్నగా నవ్వాడా కుర్రవాడు. ఇరవై ఏళ్ళ దాకా వుంటాయి వాడికి. వదులు చొక్కా, పొడుగ్గా వున్న పాంట్... చూడగానే ఆ బట్టలు ఎవరో ఇచ్చినవని తెలుస్తోంది. తైల సంస్కారం లేని జుత్తు, పెరిగిన గడ్డం...చురుగ్గా కదిలే ఆ కళ్ళు మాత్రం ఎవర్నయినా ఇట్టే ఆకర్షిస్తాయి.

"చూడ్డానికి వీడు అలా వున్నా మనిషి మాత్రం భలే చలాకీ. మీకే అవసరం వచ్చినా వీడికి చెప్పండి. చిటికెలో చేసేస్తాడు" అన్నాడు మేనేజరు.

"అవసరం' అన్న మాట అతను నొక్కి పలకడం గమనించి చిన్నగా నవ్వాడు రాజారావు.

మరో అరగంట తర్వాత మేనేజర్ తన రూమ్ తాళం వేసుకుని వెళ్ళిపోయాడు.

"స్నానానికి వేడి నీళ్ళు తెమ్మంటారా సార్?" అన్నాడా కుర్రాడు.

తెమ్మన్నట్టు తలూపాడు రాజారావు.

వేడి నీళ్ళతో స్నానం చేసి డ్రెస్ మార్చుకునే సరికి ఫ్రెష్‌గా ఫీలయ్యాడు .

"ఇదిగో...నీ పేరేమిటి?"

"గోపీ సార్".

జేబులోంచి వంద కాగితాలు తీసిస్తూ "రెండు గోల్డ్ ఫ్లేక్, ఓ మెక్ డోవెల్ ఫుల్ బాటిల్, చిప్స్, పల్లీలూ, చికెన్ బిర్యానీ...త్వరగా రావాలి...క్విక్" అన్నాడు.

గోపీ ఒళ్ళు విరుచుకుంటూ లేచి "అలాగే సార్" అంటూ ఆ నోట్లు అందుకుని బయటికి నడిచాడు.

రాజారావు ఆ గెస్ట్‌హౌస్‌నే పరిశీలనగా చూస్తున్నాడు. పాత బిల్డింగ్ కావటంతో గోడల మీద పగుళ్ళు కనపడుతున్నాయి. రంగులు వెలిసిపోతున్నాయి. ఫర్నిచర్ కూడా పాతగా వుంది.

పైకి లేచి బెడ్ రూమ్ కేసి నడిచాడు. నెమ్మదిగా తలుపు తీసి లోపలికి చూశాడు. విశాలమైన డబుల్ కాట్..అలాగే బెడ్‌కేసి చూస్తూ నిల్చున్నాడు.

ఏదో గుర్తొచ్చి చిన్నగా తనలో తనే నవ్వుకుంటూ తిరిగా ఆ తలుపు దగ్గరికి లాగుతూ టైమ్ చూసుకున్నాడు.

పది నిమిషాలయింది గోపీ వెళ్ళి.

'బ్లడీ ఫూల్...ఇంత సేపా...!'

మరో పది నిమిషాలు గడిచాయి.

'షిట్' వీడెక్కడ చచ్చాడో!'

ఇంకో అయిదు నిమిషాలకి హడావిడిగా వచ్చాడు వాడు.

"రాస్కెల్..ఇంత సేపా! త్వరగా రమ్మని చెప్పలేదూ!".

"హోటల్లో లేటయ్యింది సార్" అన్నాడు సంజాయిషీగా.

టీపాయ్‌ని రాజారావు కూర్చున్న కుర్చీకి దగ్గరగా లాగి విస్కీ బాటిల్ దానిపై పెట్టాడు. లోపలి మంచి వాటర్ బాటిల్‌లో నీళ్ళూ, గాజు గ్లాసూ తెచ్చి, బాటిల్ ఓపెన్ చేశాడు.

గ్లాసులో మూడో వంతు పోయాగానే—

"చాలు చాలు! నీళ్ళు పోయి" అన్నాడు రాజారావు.

గ్లాసు నిండే వరకూ నీళ్ళు పోసి, చిప్స్ ప్యాకెట్టూ, పల్లీల ప్యాకెట్టూ విప్పాడు.

గ్లాసులో ద్రవం నెచ్చగా నోట్లోకి జారేసరికి చిరాకంతా తగ్గిపోయింది రాజారావుకి.

కుర్చీలో వెనక్కి జారగిలబడుతూ,—

"నీ పేరేమిటన్నావ్" అడిగాడు.

"గోపీ సార్".

కూర్చోమన్నట్టు సైగ చేస్తూ అడిగాడు—

"ఎక్కడుంటున్నావ్?"

కుర్చీ పక్కగా కింద కూర్చుంటూ బయట కారు పార్క్ చేసి వున్న చోట షెడ్ చూపించాడు.

కాసేపేమీ మాట్లాడలేదు రాజారావు. గ్లాసులో ద్రవాన్ని ఖాళీ చేస్తూ మౌనంగా కూర్చున్నాడు.

మళ్ళీ తనే—

"ఎన్నాళ్ళ నుంచి వుంటున్నావు?" అడిగాడు.

"పదేళ్ళ నుంచీ ఇక్కడే వుంటున్నా సార్. మా మామ నన్నిక్కడ పెట్టాడు" అన్నాడు ఖాళీ అయిన బాటిల్‌ను మళ్ళీ నింపి ఇస్తూ.

"సార్. మంచి అమ్మాయిలున్నారు. తీసుకు రమ్మంటారా?" అన్నాడు.

వద్దన్నట్టు తలూపాడు రాజారావు.

తన ఇరవై అయిదు సంవత్సరాల సర్వీసులో హైదరాబాద్ వదిలి బయట ఏ వూరు విజిట్‌కి వెళ్ళినా, ఏ రాత్రీ ఒంటరిగా గడపలేదు రాజారావు.

క్రితం నెలలో విశాఖపట్నం వెళ్ళినప్పటి రాత్రి గుర్తొచ్చింది రాజారావుకి.

బ్లడీ బాస్టర్డ్! ఆ ఇంజనీరు గాడే చెప్పాడు? ఫ్యామిలీ టైపన్నాడు. చూడ్డానికి నిజంగా అలాగే కనిపించింది. ఆ తర్వాత వారం రోజులకి ఏదో అనుమానం వచ్చి డాక్టరు దగ్గరకెళ్ళాడు.

'ఇన్‌ఫెక్షన్ బాగా ఎక్కువగా వుంది. అదెవత్తో పక్కా బ్రోతల్‌లా వుంది. అయినా మీకు ఏభై ఏళ్ళు దాటాయి. ఇక పైన ఏమైనా రోగాలొస్తే తట్టుకోవడం కష్టం. బయట వూర్లకి వెళ్ళిన

వ్వదు కొంచెం జాగ్రత్తగా వుండండి' అన్నాడు డాక్టరు.

"దొంగ ముం..." అంటూ పైకే తిట్టాడు రాజారావు.

మూడో పెగ్గయ్యేసరికి కొంచెం కిక్కెక్కింది.

"నువ్వొచ్చి ఎన్నాళ్ళయ్యిందన్నావ్?"

"పదేళ్ళ పైనే సార్".

"అంతకు ముందెక్కడ వున్నావ్?"

"కడపలో మా మావయ్య ఇంటి దగ్గర సార్".

"మరిక్కడికెలా వచ్చావ్?"

"మా మావ తమ్ముడు ఇక్కడ పని చేసేవాడు సార్. ఆయనకి వయసయిపోయి పని చేయక పోవటంతో నన్ను తీసుకొచ్చి ఇక్కడ పెట్టాడు".

ఖాళీ అయిన గ్లాసుని తనే తిరిగి నింపుకున్నాడు రాజారావు.

"మీ మావయ్య తమ్ముడు చిన్నప్పటి నుంచీ ఇక్కడే వుండేవాడా?"

"లేదు సార్. అంతకు ముందు ఇక్కడో మొగుడూ-పెళ్ళాం వుండేవారట. ఆళ్ళదో కథ...ఆళ్ళ తర్వాత మా మావ తమ్ముడిక్కడ చేరాడట!".

"ఏదో కథ అంటున్నావేమిటి?" గ్లాసు సగం పైగా ఖాళీ చేస్తూ అడిగాడు రాజారావు.

"అవును సార్... నాకూ సరిగ్గా తెలీదు. ఎవరెవరో చెబితే వినడమే..అబ్బో పదిహేనేళ్ళ క్రితం మాటిది...అప్పట్లో ఈ బంగళా చూసుకోవడానికి ఓ మొగుడూ-పెళ్ళాం, అదుగో ఆ షెడ్‌లోనే వుండేవారట! ఓ రోజు సాయంత్రం ఇద్దరు ఆఫీసరు బాబులు ఇక్కడ దిగారట!

ఖాళీ గ్లాసు మళ్ళీ నింపుకున్నాడు రాజారావు. అతనికి నెమ్మదిగా కంట్రోల్ తప్పుతోంది.

"రాత్రి బాగా తాగాక మొగుణ్ణి ఏదో పని చెప్పి వూర్లోకి పంపారట! నీళ్ళు తెమ్మని 'ఆమె'ని లోపలికి పిలిచి ఇద్దరూ ఆమెని రేప్ చేశారట! ఊర్లోంచి వచ్చిన ఆమె భర్త అది చూసి ఆవేశంతో ఆ ఇద్దరినీ కత్తితో పొడిచి చంపేశాడు. పోలీసులు అతణ్ణి అరెస్టు చేశారు. అదే రాత్రి ఆమె ఆత్మహత్య చేసుకుంది".

రాజారావ్‌కి నిషా పూర్తిగా ఎక్కింది. మనిషి కొంచెం తూలుతున్నాడు. తాగుతున్న గ్లాసు కింద పెట్టి పెద్దగా నవ్వి చెప్పాడు.

"గోపీ...ఈ కథలో నీకు తెలీని రహస్యం ఒకటి నాకు తెలుసు. ఆ మాటకొస్తే ఇది నాకొక్కడికే తెలుసు".



"............"

"ఆ రాత్రి ఆమె భర్త బయటికి వెళ్ళాక ఓ మూడో వ్యక్తి ఈ గెస్ట్ హౌస్‌లోకి వచ్చాడు. అప్పటికే అతని ఫ్రెండ్స్ ఇద్దరూ బాగా తాగి ఉన్నారు...ఆమెని లోపలికి పిలిచి ముగ్గురూ రేప్ చేశారు. కానీ ఆమె భర్త వస్తున్న అలికిడి వినగానే మూడో వ్యక్తి వెనుక వైపు డోర్ లోంచి పారిపోయాడు. మైకంలో వున్న అతని ఫ్రెండ్స్ ఇద్దరూ ఆమె భర్తకి దొరికిపోయారు".

గోపీ బాటిల్‌లో మిగిలిన విస్కీ గ్లాసులో పోసేసి బాటిల్ దూరంగా విసిరేశాడు. రాజారావు ఆ గ్లాసు అందుకుని మళ్ళీ తాగుతూ చెప్పాడు.

"ఈ కథలో వున్న ఆ మూడో వ్యక్తి గురించి ఎవ్వరికీ తెలీదు. నాకొక్కడికే తెలుసు".

"ఈ కథలో నాకు కూడా ఓ రహస్యం తెలుసు సార్. ఆ మాటకొస్తే ఇది మీకు కూడా తెలియని రహస్యం" అన్నాడు గోపీ.

"ఏమిటది?" ఆశ్చర్యంగా అడిగాడు రాజారావు గ్లాసు కిందపెడుతూ.

"ఆ జంటకి అప్పటికే ఓ ఏడేళ్ళ పిల్లాడు వున్నాడు. ఆ రోజు రాత్రి ఆ ముగ్గురూ తన తల్లిని చెరచడాన్ని అదిగో, ఆ బెడ్ రూమ్ కిటికీ లోంచి చూశాడు. మీరు చెప్పిన ఆ మూడో వ్యక్తి పారిపోవటం కూడా అతను చూశాడు".

రాజారావుకి కొంచెం మత్తు దిగుతున్నట్టయ్యింది.

"మిగిలిన ఇద్దరి పైనా తన తండ్రి పగ తీర్చుకుంటే, ఆ మూడో వ్యక్తి పైన తను పగ తీర్చుకోవాలని అతను ఎదురు చూశాడు. అందుకే ఎవరికీ ఆ సంగతి చెప్పలేదు. ఆ మూడో వ్యక్తి ఎప్పటికైనా మళ్ళీ ఈ గెస్ట్ హౌస్‌కి వస్తాడని అతని నమ్మకం".

రాజారావు నిషా పూర్తిగా దిగిపోయింది. చెవుల్లో ఏదో భరించలేని హోరు. కళ్ళు తిరుగుతున్నాయి.

"చివరికి ఒక రోజు నిజంగానే ఆ మూడో వ్యక్తి మళ్ళీ వచ్చాడు. అప్పుడు ఆ అబ్బాయి ఏం చేశాడో తెలుసా సార్?

రాజారావుకి ఒళ్ళంతా విపరీతంగా చెమటలు పడుతున్నాయి.

గోపీ బయటికి నడుస్తూ చెప్పాడు-

"అతను విస్కీలో కలుపుకోవడానికి ఇచ్చిన నీళ్ళల్లో విషం కలిపాడు".